## 1983 ఉగాది కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ!

# 'రామ్మూర్తి అప్రయోజకుడు' అని నాకు నేనుగా చాలాసార్లు అనుకున్నాను.

### ఈ అభిప్రాయాన్ని నా నిర్ణయంగా కూడా చక్రపాణికి అనేకసార్లు చెప్పాను.

రామ్మూర్తి చక్రపాణికి స్వయానా మేనమామ కొడుకు.

చక్రపాణి తాడేపల్లిగూడెం వెళ్ళొచ్చినప్పుడల్లా అడిగేవాణ్ణి నేను— "రామ్మూర్తి ఏం చేస్తున్నాడూ?" అని.

చక్రపాణి తన 'స్టాక్ రిప్లై' నా ముఖాన విసిరేవాడు—"ఆంధ్ర ప్రదేశ్ లోని ముఖ్యమైన పట్టణాల్లో రోడ్లు కొలవటం అయిపోయిందిట. ధార్వార్ వస్తానంటున్నాడు. రమ్మందామా?"

తన సమాధానానికి అనుబంధంగా సంధించిన ప్రశ్నకి నా దగ్గర జవాబు లేదు. ఈ సంగతి పాణికి తెలుసు కనుక ఆ సంభాషణ అంతటితో ఒక గంభీరమైన వాతావరణం లోకి ప్రవేశించేది. చక్రపాణీ నేనూ ఒకే ఆఫీసులో పనిచేస్తూ వున్నాం. వుండటం కూడా దగ్గర దగ్గర ఇళ్ళల్లోనే.

"దేశంలో పరిస్థితులు ఎంత దారుణంగా వున్నాయనుకున్నా, ఈ విడ్డూరం మాత్రం నేను నమ్మను- పాణీ. రామ్మూర్తి వట్టి సోమరి. అతనికి ఏ మాత్రం 'పుష్షూ, ఇనీషియేటివ్' లేవు" అనే వాణ్ణి నేను.

రామ్మూర్తి అప్రయోజకత్వానికి జాలి పడటం మాట అటుంచి; విలక్షణమైన అతని తత్వం; స్వభావం, రూపురేఖలూ—గుర్తుకొచ్చినప్పుడల్లా. విరోధాభాసంలో పడిపోయేవాణ్ణి నేను.

రామ్మూర్తితో నా పరిచయం వయసు పదేళ్ళు.

మొదటిసారి అతను ధార్వార్ వచ్చినప్పుడు పాణి పరిచయం చేశాడు—"ఎమ్మే చదువుతున్నాడు తెలుగు. ఈ ఏడాదితో అయిపోతుంది. మమ్మల్ని చూద్దామని వచ్చాడు" అని.


రామ్మూర్తిని తేరిపార చూశాను. గుప్పెట్లో నాణెం క్రింద పారేసుకుని వెతుక్కుంటున్న పిల్లవాడిలా నేలచూపులు చూస్తున్నాడతను. ఎదుటిమనిషి తన కళ్ళల్లోకి చూస్తుంటే అతను మొహాన్ని క్రిందికి వంచేస్తాడు.

ఆకారం—దూలం పట్టుకు వ్రేలాడుతున్న బూజు పోచలా వుంటుంది. నూనె మొహం చూడని దుబ్బు జుట్టేమో గాలితో ఆడుకుంటూ వుంటుంది.

పాణీ నేనూ కలిసి అతనికి కర్ణాటక యూనివర్సిటీ, అగ్రికాలేజీ మొదలైన ప్రదేశాలు చూపించాం.

కర్ణాటక యూనివర్శిటీ చాలా ఎత్తయిన కొండమీద విశాలమైన ఆవరణలో వుంది. ఆహ్లాదకరమైన వాతావరణం. గజారోహణ చేసిన కవి రాజులా యూనివర్శిటీ బిల్డింగ్, దానిముందు చక్కటి వుద్యానవనం. చుట్టూ బొటానికల్ గార్డెన్స్. పాలుపోసి ఎత్తుకునేందుకు వీలైనట్లు పరిశుభ్రమైన రోడ్లు. పచ్చటి లాన్స్. వివిధ భవంతులూ చూశాం. ఆ ప్రదేశాన్ని తలచుకుంటేనే మనసు పులకరిస్తుంది. వెన్నెల్లో పావురాలతో ఆడుకుంటున్న అనుభూతి కలుగుతుంది.

రెండు గంటలు తిరిగేము.




ఇంటి నుంచీ తీసుకువెళ్ళిన 'చిరుమోరియా'. 'అవలక్కి' తిని నీళ్ళు తాగేము.

అంతా అయిన తరువాత తిరిగి వచ్చేందుకు 'సాధనకేరి' బస్సు ఎక్కేము.

"ఎలా వుంది యూనివర్సిటీ?" అన్న పాణి ప్రశ్నకు- "ప్చ్. ఏదో ఫర్వాలేదు" అన్నాడు రామ్మూర్తి, పెదవి విరిచేస్తూ.

గాలి తీసినట్లయింది నాకు మాత్రం. అతి ప్రియమైన బొమ్మని లాక్కుని విరిచి పగలగొట్టి పొయ్యిలో పడేసినట్లనిపించింది.

ఆ మర్నాడే వ్యవసాయ విశ్వవిద్యాలయం చూశాము.

మెయిన్ బిల్డింగ్, డెయిరీ ఫారమ్. హోమ్ సైన్స్ విభాగంలో కేకులూ, బ్రెడ్ తయారుచేసే సాధనాలూ. వ్యవసాయ క్షేత్రం, పూలు, పళ్ళతోటలూ చూపించాం. అక్కడి తోటల్లో విశేషం: కొబ్బరి, నిమ్మ, సపోటా, బత్తాయి, మామిడి, పనసచెట్లలో రకరకాల జాతులూ; పూల మొక్కల్లో: వివిధ రంగుల్లో అంగుగు వ్యాసంగల మందారాలూ, కనువిందుచేసే గులాబీలూ-ఒక్కొక్కటీ విశదంగా వర్ణిస్తూ వివరంగాచెప్పారు మా మిత్రుడు వెంకట్రామయ్యగారు.

తిరిగి వస్తుంటే సన్నని తుంపర మొదలయింది.

హృదయం గీసుకున్న చిత్రాలకు రంగులు వేసేందుకు మనసుకు సహాయం చేస్తున్నది చిరుజల్లు. రుచికరమైన ప్రకృతి కవితకు రాగాలు కూర్చుకోసాగింది నాలుక.

బస్సులో కూర్చున్నాము.

రామ్మూర్తి ఏమీ మాట్లాడలేదు. పచ్చని చెట్లను తొడుక్కున్న కొండల్ని చూస్తూ కూర్చున్నాడు.

"పూలు చాలా బాగున్నై కదూ?" అడిగాడు పాణి.


"ఏదో వున్నై—పళ్ళకల్లా. అన్ పీల్డీగా పెరిగిన ఆడదానిలా" అన్నాడు రామ్మూర్తి.

మేమిద్దరమూ విస్తుపోయి, కళ్ళప్పగించి చూస్తూ వుండిపోవాల్సి వచ్చింది.

అప్పుడే ఆతణ్ణి జోగ్ కూడా తీసుకువెళ్ళాం మేము.

జోగ్ని చూసి—"దీని కోసం ఇంత దూరం రావడం "వేస్ట్". ఈ మాత్రం నీరు చాలా కొండల్లోంచి వస్తూ వుంటుంది" అన్నాడు.

పాణి అతనికి జోగ్నిగురించిన గణాంక వివరాలను బోధించాలని ప్రయత్నించాడు



# చలిలో సూర్యుడు

విహారి

గాని, రామ్మూర్తి ఉత్సాహం చూపలేదు.

మరోవైపు నడిచి ఒకచోట ఆగేం. క్రిందికి చూస్తే కొన్ని వందల అడుగుల లోతుతో రెండు కొండల మధ్యగా శరావతి నిశ్చలంగా పారుతోంది అక్కడ. అంతఎత్తు నుంచీ చూస్తుంటే పెద్ద ముత్తైదువ పాపిటలా వుంది-నది. దానికి పక్కగా పవర్ హౌస్ వుంది—కలశం మీద నిలబెట్టిన టెంకాయలా!

చాలా అవస్థపడి పవర్‌హౌస్‌లోకి వెళ్ళేందుకు అనుమతి తీసుకువచ్చాడు పాణి. ట్రాలీ మీద భూగర్భంలోకి ప్రయాణం. అదొక 'థ్రిల్'! నాకూ, పాణికీ చాలా ఆనందంగా వుంది.

'మీరుపోయిరండి' అన్నాడు రామ్మూర్తి. పాణి వూరుకోలేదు. చివరికి అతని బలవంతాన రామ్మూర్తీ వచ్చాడు. క్రింద పవర్ జనరేటర్లూ వాటి వివరాలూ తెలుసుకున్నాం. పైకి వచ్చాం.

తిరుగు ప్రయాణంలో నేనూ, పాణీ

మా అనుభూతిని నెమరువేసుకుంటుంటే రామ్మూర్తికి విసుగేసింది. అతనన్నాడు- "ఇంతగా సంబరపడిపోవడానికి వీటిల్లో ఏముందనీ—ఎవడి వుద్యోగం వాడు చేశాడు, చేస్తున్నాడు. అంతేగదా."

నేను విచారంతో క్రుంగిపోయాను. కోపంతో లోలోపల నామీద నేనే చిర్రుబుర్రులాడుతున్నాను. తెలుగు ఎమ్మేత్రవాడి కుండవలసిన సున్నితమైన మనస్సు. స్పందన-ఈ మనిషికి కనీసస్థాయిలోనన్నా లేవేమా. అని బాధపడ్డాను.

ఆదివారం వచ్చింది. పదిగంటల వేళ—టిఫిన్ అయిన తర్వాత కూరగాయల మార్కెట్‌కి వెళ్ళిరావడం నాకూ. పాణికీ అలవాటు. నేను బయల్దేరి వాళ్ళ భాగంలోకి వెళ్ళాను.

పాణీ రామ్మూర్తీ భోజనం చేస్తున్నారు నేను ఆశ్చర్యంగా "ఇదేం విటివ్వాళ ఆదివారం. మామూలు రోజుల్లాగా పదింటికే భోజనాలవుతున్నైన్" అని అడిగాను.

పాణి భార్య సుకన్య. ఆమె అన్నది. "హంబ్లీ ప్రయాణం. మీ రూరండి" అంటూనే నాకూ విస్తరివేసింది హడావుడిగా. నేనేమీ మాట్లాడలేక పోయాను. మనస్సులోమాత్రం ఉత్సాహంగాలేదు. రామ్మూర్తి నిరాసక్తత, నిర్లిప్తత, ఉదాశీనతలకు బాధపడవలసి వస్తుందే అని సందేహం.

పాణి అన్నాడు. "సరదాగా పోయొద్దాం పద."

వాళ్ళ భోజనాలు కావచ్చినై.-రామ్మూర్తి అన్నంలోపాలుపోసుకున్నాడు. కొన్నిక్షణాల తరువాత అతను సుకన్యని అడిగాడు. పడియాలు వెయ్యమని. ఆమె వేసింది. వాటిని

# నటన

'నటన' అంటే.... ?
ఏముంది —
ముందు కాకీ బట్టలు !
తర్వాత తెలుపు దుస్తులు !!
ఇప్పుడు కాషాయ వస్త్రాలు !!!

—దొడ్లంకి వెంకట్రావ్

చిదిపి పాలలో కలుపుకుని తినడం మొదలు పెట్టాడు రామ్మూర్తి. చిత్రమైన అలవాటు !

భోజనం అయిందనిపించి లేచాను.

హంబ్లీలో నృపతుంగ బెట్ట చూశాము. అదొక కొండ. అక్కడే ఆ మహర్షి తపస్సు చేశాడని చెబుతారు.

ఆ తర్వాత ఇందిరా పార్క్. గ్లాస్‌హౌస్ చూసి. మూరుసావిర మఠ్‌కి వచ్చాం. అది చాలా పెద్ద మఠం. ఎత్తయిన కట్టడం. విశాలమైన ఆవరణ. ఎన్నెన్నో గదుల్ని సీలింగ్‌కీ. దూలాలకీ చాలాచోట్ల తేనెపట్లు వుండి చిత్రంగా వుంటుంది ఆ ప్రాంగణమంతా. చిన్న శివాలయం. ముఖద్వారంలో వైపు గున్న ఏనుగు.

అన్నీ చూసి. "కామత్"లో టిఫిన్ కాఫీ పూర్తిచేసి సినిమా హాలుకు వచ్చాం. "సిరి సిరి మువ్వ" ఆడుకోంది. టిక్కెట్లు తీసుకుని హా కెళ్ళి కూర్చున్నాం.

సినిమా ఇంకా ప్రారంభం కాలేదు. "హంబ్లీ ఎలా వుంది"— అడిగాడు పాణి, రామ్మూర్తిని ఉద్దేశించి.

పట్టు వదలని విక్రమార్కుడు గుర్తుకొచ్చాడు నాకు. సన్నగా నాలో నేను నవ్వుకున్నాను.

రామ్మూర్తి నాకేసి, పాణికేసి చూపులు మార్చిమార్చిచూశాడు. తలవంచుకున్నాడు. నేల చూపులు చూస్తూ "ప్రయోగానికి సిద్ధం చేసిన రాకెట్‌కి పసుపు కుంకుమ పెట్టినట్లుంది" అన్నాడు.

అతని మాటల్లోని భావాన్ని అర్థం చేసుకోవడానికి చాలాసేపు పట్టింది నాకు. సినిమా జరుగుతూ వుండగా మధ్యలో తట్టింది, నాగరికతను పెంచుకుంటున్న పట్నంలో మూరుసావిర మఠ్. నృపతుంగ బెట్టలను బహుశా రామ్మూర్తి అలా పోల్చాడుకాబోలని!

చాలా అయిష్టంగానే-ఆ తరువాత రెండ్రోజులకి -మలప్రభా డామ్‌కి బయలుదేరాను నేను—రామ్మూర్తీ పాణీలతో కలసి.

కృష్ణకి ఉపనది మలప్రభ. రెండు కొండలకు మధ్యన చిన్న డామ్ అది. నదికి అవతల వొడ్డున డామ్‌కి ప్రక్కగా కొండమీద నెమలిబొమ్మ రంగుల్లో వుంది. మమ్మల్ని అక్కడ నిలబెట్టి ఫొటోలు తీశాడు పాణి. డామ్‌కి దిగువన నదివేగం తక్కువ. చట్టుబండలన్నీ మద్దికాయల్లా పైకి కనబడుతూ వుంటాయి. అక్కడ స్నానాలు చేశాం. గెస్ట్‌హౌస్. పార్కు మొదలైన ప్రదేశాలు చూసి తిరుగుప్రయాణమైనాం.

దిక్కులు చూస్తూ పరధ్యానంగా వున్న రామ్మూర్తి యధాలాపంగా అన్నాడు "ఈ డబ్బులో సగం పెట్టి ఏ కొండ దిగువనో చెరువునుతవ్విస్తే సరిపోయేది. ధార్వాడ్‌లో వర్షానికేం కరువులేదుగా" అని.

పాణి సంభాషణ అంతటితో ఆగిపోయింది.

సౌవత్తి నుంచీ ఎల్లమ్మగుట్ట చేరాము.


దేవాలయం ప్రాచీనమైనది. అయితే. వాతావరణం చాలా అపరిశుభ్రంగా వుంది. అక్కడినుంచి వెంటనే బయల్దేరి ధార్వార్ వచ్చేశాము.

"దేశం మొత్తాన్ని అద్దంలో చూసినట్లుంది"—అనేది ఎల్లమ్మగుట్ట గురించి రామ్మూర్తి వ్యాఖ్య.

ఆ ఏడాది చివర్లో రామ్మూర్తిని నేను రెండోసారి చూశాను. ధార్వార్ వచ్చేడు. అప్పటికి అతను తెలుగు సాహిత్యంలో ఎమ్మే యూనివర్శిటీ ఫస్ట్ అయ్యాడు.

"రిజల్ట్‌ను మాకు వ్రాయలేదేం?" అన్నాన్నేను నిష్ఠూరంగా—అతనితో మాట్లాడుతూ.

"పెద్ద విశేషమేముందిమాష్టారూ.ఎవరో



ఒకరికి ఇవ్వాలి కదా. నాకిచ్చారు. నా దరిదాపుల్లో వాళ్ళకి కావల్సిన వాళ్లెవరూ లేకపోవడం "యాక్సిడెంట్" అంతే" అన్నాడు చాలా నిర్లిప్తంగా.

నేనతనికి మంచి భవిష్యత్తును ఆశిస్తూ. ఏదన్నా కాలేజీలో చేరమనీ. ఆ తర్వాత పి హెచ్‌డి. చేయమనీ సలహా ఇచ్చాను. విని వూరుకున్నాడు.

మర్నాడే అతను తాడేపల్లిగూడెం వెళ్ళిపోయాడు.

అప్పట్నించీ ఏటికో కోటికో వొకనాడు అతని నుంచీ ఉత్తరం వచ్చినపుడు చక్రపాణి చెప్తూ వుండేవాడు "రామ్మూర్తికి ఇంకా వుద్యోగం రాలేదు" అని. పాణి వేసవిలో తాడేపల్లిగూడెం వెళ్ళి వచ్చినప్పుడల్లా నేను రామ్మూర్తిని గురించి విచారించడం నాకు అలవాటయిపోయింది. "రామ్మూర్తి ఏం చేస్తున్నాడు?" అని నేనడగటం. "ఆంధ్ర ప్రదేశ్‌లోని ముఖ్యమైన పట్టణాల్లో రోడ్లు కొలవడం అయిపోయిందట-ధార్వార్ వస్తానంటున్నాడు. రమ్మందామా?" అని పాణి అనడం. మా సంభాషణ అంతటితో ఆగిపోవటమూ పరిపాటయిపోయింది.

అడపాదడపా ఆఫీసులో కొత్తగా రిక్రూట్‌మెంట్ జరిగి. కాలేజీలో చదువుకుంటున్న గడ్డాలు మొలవని కుర్రాళ్ళూ. లంగాలు వదలని ఆడపిల్లలూ కుప్పతెప్పలుగా వుద్యోగాల్లో చేరిపోతున్నప్పుడూ. వారిలో తమ ఆర్థికపరిస్థితినీ. వుద్యోగావసరాల్నీ చెప్పుకోవడాన వొకరిద్దరికి నేను చేయగలిగిన సహాయం చేస్తున్నపుడూ—రామ్మూర్తి నా కళ్ళముందు మెదిలేవాడు.

విజయవాడ స్టేషన్లో—బందరునుంచీ తిరుపతిపోతూ ప్లాట్‌ఫారమ్‌మీద పచార్లు చేస్తున్నాను. రైలుకు చాలా టైముంది.

హఠాత్తుగా రామ్మూర్తిని చూశాను. పాతబడి పాదానికి ఆరంగుళాల పైదాకా వున్న పాంటు. తనది కాదేమో ననిపించేటంత వదులున్న చొక్కా. చేతులన గోగుకాడల్లా వూపుకుంటూ దగ్గరగా వచ్చేశాడు. రిఫ్రెష్‌మెంట్ రూమ్‌కువెళ్ళి కూర్చున్నాం. కాఫీలు ఆర్డర్ చేశాను.

యోగక్షేమాలకంటే ముందు నా గుండె గొంతుకలో కొట్టాడే ప్రశ్ననే అతని ముందుంచాను. "ఏం చేస్తున్నా విప్పుడు?"

చాలా చిత్రంగా నవ్వేడు రామ్మూర్తి. "మీలాంటివాళ్ళు కాఫీ ఆర్డర్‌చేస్తే తాగుతున్నాను"అంటూ కాఫీ సిప్ చేయసాగేడు.

నా కళ్ళముందు ఒక్కసారిగా చీకట్లు కమ్ముకున్నట్లయింది. ఆలోచన పరిపరివిధాలపోయింది. బాధ. కోపం కలసిన స్వరంతో బయట పడిపోయాను. "దేశంలో పరిస్థితులు ఎంత దారుణంగా వున్నాయనుకున్నా ఈ విడ్డూరం మాత్రం నేను నమ్మలేకుండా వున్నాను. నీకు ఏమాత్రం పుష్టా. ఇనీషియేటివ్ లేవు. లేకుంటే ఎమ్మేయూనివర్శిటీ ఫస్ట్‌వాడివి. ఎనిమిదేళ్ళ నుంచీ ఉద్యోగం లేకుండా ఇలా...."

నా ఆవేశాన్ని మధ్యలోనే ఆపుచేస్తూ చాలా పెద్దగా నవ్వసాగేడు రామ్మూర్తి. కీలుబొమ్మ కిచకిచమన్నట్టుంది ఆ నవ్వు. క్షణాల తర్వాత గంభీరంగా చెప్పసాగాడు.

"రైలు ప్రయాణీకుల్లో ఎన్ని తరగతుల వాళ్ళున్నారో ఆలోచించండి. ఏ.సీ. తెప్పించుకునేవాడొకడూ. ఫస్ట్ క్లాస్ కొనుక్కునేవాడొకడూ. బెర్త్ రిజర్వ్ చేసుకునేవాడొకడూ. సీటు ఖాయం చేసుకునే వాడొకడూ—వీళ్ళల్లో ప్రతివాడూ తమ క్రిందితరగతివాడు కొరగాని వాడనే అనుకొంటాడు. జనరల్ కంపార్ట్‌మెంట్‌లో కూడా తోసుకునీ నెట్టుకునీ ముందు ఎక్కగలిగినవాడు ప్లాట్ ఫారమ్ మీద మిగిలిపోయిన వాణ్ణిచూసి భీరువు.అసమర్థుడుగానే భావిస్తాడు. నా పరిస్థితీ అలాగే వుంది".

రామ్మూర్తి చెప్పటం ఆపి. పక్కగా వెళ్తున్న బేరర్‌ని కేకేశాడు. "రెండు దోశె పట్రా అన్నాడు. నేనేదో అనబోయాను. "మీకు కాదులెండి-రెండూ నాకే"అన్నాడు.

గొంతు సరిచేసుకుని నేలచూపులుచూస్తూ మళ్ళీ మొదలు పెట్టాడు.

"కొన్ని వుద్యోగాలకి అనుభవం కావాలి. కొన్నిటికి వాళ్ళ కులం కావాలి. కొన్నిటికి ధనం కావాలి. కొన్నిటికి సిఫార సుకావాలి. ఇవన్నీ అలా వుంచండి. కొన్నిటికి అదే ప్రాంతంలో పుట్టి పెరిగి చదివి అక్కడే వుంటూ వుండాలి. కొన్నిటికి భాష అడ్డుగోడ-కాదంటారా?"

అతని కంఠస్వరం కొంచెం కరుకు తేలడం గమనించాను.

"మీకు నా కేవిధంగానూ సహాయం చేయలేక పోవడానికి కూడా ఇదే కారణంకదూ?"


అవునన్నట్టు తలూపేను.

అతను కొనసాగించేడు. "నేను తెలుగు ఎమ్మేను కావడం కొన్ని ఉద్యోగాలకు అనర్హత. వాటికి కనీసార్హత బియ్యే అయినా.ఆ బియ్యేలోనూ యూనివర్సిటీ సెకండ్‌రాంక్ నాకున్నా-నేను చివరికి ఎమ్మేనని తేల్చేస్తారు పక్కకు తోసేస్తారు." ఉద్వేగంతో రామ్మూర్తి గొంతు బొంగురు పోయింది.

"ఇవన్నీ మనకు తెలియని పరిస్థితులు కావనుకో. గొంగట్లో భోంచేస్తూ వెంట్రుకలేరుకోనక్కరలేదు. పోనీ ఏ పత్రికలోనన్నా ప్రయత్నించవచ్చుగా."

"మా బాగా చెప్పారు. అదీ అయింది.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడెన్సా
విలేపనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
1 TGA



స్విఫ్ట్ ఆర్ట్స్ అపూర్వ రూపకల్పన
మంగళాక్షత కార్డులు
నవదంపతులకు శుభాశీస్సులు
తెలుగు, తమిళం, కన్నడం,
మలయాళం, హిందీ, గుజరాతీ,
మరాఠీ, పంజాబీ, ఇంగ్లీషు భాషలలో
అవసరమైనప్పుడు మీకు తెలిసిన
షాపులలో విచారించండి.
లేవంటే-తెప్పించమనండి. ఈ
కార్డులను పోస్టులో తెప్పించుకోవడం
మీకు లాభసాటి కాదు.
SA/GC 84-5

డైరెక్ట్ నవలలు
లల్లాదేవి
*కౌలానికి నిలిచిన కథ -14/-
*ఆత్మ చెప్పిన కథ -15/-
గిరిజశ్రీ భగవాన్
కథానాయకుడు కావాలి 14/-
కొడాలి సాంబశివరావు
*రాగాల పల్లకి -14/-
పారిజాత సుమం -14/-

అక్కడ ఇంటర్వ్యూలో ప్రశ్నలు చెప్పనా?" అని పన్నగా నవ్వేడు. "కమ్యూనిస్టులవల్ల నీ అభిప్రాయం ఏమిటి?" "పాతివ్రత్యానికి ఇంగ్లీష్ పదమేమిటి?" "నిన్ను నక్సలైట్ అంటే ఏమంటావు?" "పిల్లలకు మాత్రమే అని పెద్దవాళ్ళని ఆకట్టుకొనే సీరియల్ రాయగలవా?" "సినిమా ఎడ్వర్టైజ్‌మెంట్ సంపాదించే నాలుగు మార్గాలు చెప్పు"— ఇవీ ప్రశ్నలు!

"ప్రతి పత్రికకీ పాలసీ వుంటుంది. కాదనను. కానీ, అన్ని పత్రికల ఆరాటమూ పుట్టిన ఆరోనెల్లోనే అనన్య సామాన్య ప్రచారం పొందాలనే తాపత్రయం. దానికి మన తెలివి పనికిరాదని వాళ్ళు పసిగట్టేశారు."

దోశెలు తెచ్చాడు బేరర్. వాటిని చాలా ఆబగా తినసాగేడు రామ్మూర్తి.

నేను మౌనంగా కూర్చున్నాను.

అవి తినడం పూర్తవుతుండగా రెండు ప్లేట్ల వడలకి ఆర్డరిచ్చాడు రామ్మూర్తి. "మీ దగ్గర ఈ మాత్రం డబ్బుకు కొదవ లేదనుకుంటా" అన్నాడు. యథాలాపంగా ప్లేట్‌లోనే చెయ్యి కడుక్కున్నాడు. నా సమాధానానికి ఎదురు చూడలేదు. నేను పరీక్షగా అతనికేసి చూస్తూ అతని చొక్కానీ పాంట్‌నీ పరిశీలించసాగేను. దీన్ని అతడు పసిగట్టేడు. "మీరు నా వంక అలా పరీక్షగా చూస్తుంటే చెప్పాలనిపిస్తోంది. నేను ధార్వార్ వచ్చినపుడు మా పాణీ మీరూ కలసి చాలా ప్రదేశాలు చూపించారు నాకు. అవన్నీచూసి నేను చాలా సాదాగా పెదవులు చప్పరించే సేవాణ్ణి గుర్తుందికదూ! అలాటిదే ఈ దుస్తుల అవతారమూనూ. దేశం ముందుకే పోతున్నదనే దానికి దాఖలాగా పెరుగుతున్న పట్టణాన్నీ, పైకి లేస్తున్న భవంతుల్నీ, రద్దీతో రొద చేస్తున్న సినిమాహాళ్ళనీ, జనంతో కిక్కిరిసిన మార్కెట్లనీ, టీపీ పెట్లనీ చూపిస్తాం మనం. కానీ"— అని ఆగేడు.

వడ ప్లేట్లు వచ్చినై. నేను రెండు కాఫీ చెప్పేను. వడలు తినడం పూర్తిచేసి కాఫీ తాగేవరకూ రామ్మూర్తి పన్నెత్తి మాట్లాడలేదు.

కుడి ముంజేత్తో మూతి తుడుచుకుని మొదలెట్టాడు మళ్ళీ. "కడుపు నిండినవాడు మాత్రమే కళ గురించీ, అభివృద్ధి గురించీ, సంస్కృతి గురించీ, నాగరికత గురించీ మాట్లాడగలడు. వాటి రూపాన్ని చూసి స్పందించగలడు. ఇప్పుడు చూడండి. నాకు రెండు రోజుల ఆకలి తీరింది. పేపర్ చూద్దామనే కోరిక కలుగుతోంది" అని నా చేతిలోని పత్రికని తీసుకుని తిరగేయసాగాడు.

నేను ఆలోచనలో పడ్డాను. రామ్మూర్తి

## ఆచరణ

అందమైన
ముఖము కూడ
పగిలిన 'అద్దం'లో
వికృతంగా
కనబడుతుంది ...
అలాగే—
ఆశయం
మంచిదైనా
ఆచరణ
బాగోలేకపోతే
ఆ ఆశయం
భయంకరంగా
కనిపిస్తుంది

—మధు

ధార్వార్ వచ్చినప్పటి రోజులు గిర్రున నా కళ్ళముందు మెదిలేయి. మా విహార యాత్రలూ గుర్తుకొచ్చినై.

ఒక్కొక్క ప్రదేశాన్ని చూసినప్పుడూ, ఒక్కొక్క అనుభూతితో గుండెని పండించుకున్నప్పుడూ—నా ఆనందానికీ, అనుభూతి స్పందనకీ పూర్తిగా భిన్నమైన రామ్మూర్తి ఉదాసీనతకి కారణం—క్లోజప్‌లో దర్శనమిచ్చింది!

మరికొంత సేపటికి ఇద్దరమూ లేచి బయటకు వచ్చాం. రైలు ప్లాట్‌ఫారం మీదికి వచ్చింది. నేను ఎక్కేను. రామ్మూర్తి సెలవు తీసుకున్నాడు.

రైల్లో కూర్చుని రామ్మూర్తి మాటలు మననం చేసుకోసాగేను. అతను చెప్పింది యథార్థమేననిపించింది. అయినా తన అసమర్థతకి సంజాయిషీ యిచ్చి నానుంచి తప్పించుకు పోయాడేమో రామ్మూర్తి అనే సందేహమూ కలిగింది.

బహుశా అందుకేననుకుంటా—'ఏమైనా రామ్మూర్తి అప్రయోజకుడు.' అని నాకు నేనుగా మరోసారి అనుకున్నాను.

* * *

—ధార్వార్ నుంచి బదిలీ అయి విజయవాడ వచ్చేశాను.

ధార్వార్ మిత్రులు క్రమంగా జ్ఞాపకాల్లో కూడా తెరమరుగు కాసాగేరు.

రోజులు నెలలుగా సంవత్సరాలుగా మారి కాలగర్భంలో కలిసిపోతున్నై. ఆరేళ్ళు గడిచాయి.

ఈలోగా పెళ్ళీ పేరంటాలూ జరిగి, సంసార ఝంఝూటంలో పడ్డాను. ముగ్గురు పిల్లలు కొత్త సభ్యులైనారు యింట్లో.

మళ్ళీ బదిలీ అయింది—హైదరాబాదుకు.

మా పెద్దవాడికి స్కూలులో అడ్మిషన్ కష్టమైపోయింది. స్థానికంగా పలుకుబడి గల ఆఫీసు మిత్రుణ్ణి తీసుకుని స్కూల్‌కి వెళ్ళాను.

ఆ స్కూల్‌కి "హెడ్‌మాస్టరు మరియు కరస్పాండెంట్"గా రామ్మూర్తి పరిచయమైనాడు! నేను ఆశ్చర్యంతో కొయ్యబారి పోయాను!

యోగక్షేమాలు, పరామర్శల తర్వాత స్కూల్‌కి వెనగ్గానే వున్న తన యింట్లోకి తీసుకు వెళ్ళాడు రామ్మూర్తి. భార్య సుందరిని పరిచయం చేశాడు. ఆమె కాఫీ తెచ్చింది.

నేను పరిశీలనగా రామ్మూర్తికేసిచూశాను. అతనిప్పుడు బాగా ఒళ్ళు చేశాడు. కళ్ళల్లో ధైర్యం, ముఖంలో గాంభీర్యం ద్యోతకమవుతున్నై. పచ్చకర్పూరమూ, లవంగాలూ కలిసిన పన్నీటి స్నానం చేయించి నిలబెట్టిన విగ్రహంలా వున్నాడతను!

"కాఫీ సిప్ చేస్తూ అన్నాడు, "అంతగా ఆశ్చర్యపోకండి మాస్టారూ, ఆ రామ్మూర్తినే. పెళ్ళి సంబంధాల విషయంలో కూడా—జనమంతా నన్ను మీరనుకున్నట్టే అప్రయోజకుణ్ణి అని అనుకుని పిల్లనివ్వనన్నారు. నా బోటులోనే ప్రయాణం చేస్తున్న సుందరి తనే నాకు జీవన రహస్యాన్ని బోధించింది. ఇతరుల అవసరాన్ని మనం నగదు చేసుకోవాల్సిందేగానీ, మన అవసరానికి ఇతరులు నగదుని ముట్టచెప్పరు—అనేది ఆవిడ జీవన సిద్ధాంతం. ఆవిడ ఎమ్మే ఫిలాసఫీ లెండి. ఆ తర్వాత ఇద్దరమూ ఒకటైపోయి ఈ కాన్వెంట్ ప్రారంభించాము. మూడేళ్ళయింది. చూశారుగా—ఇప్పుడు మూడువందల మంది పిల్లలున్నారు. వచ్చే ఏడు బిల్డింగ్ వస్తుంది. మీ వాడికేం దిగుల్లేదు. చేర్పించండి" అని నా కళ్ళల్లోకి ఒకసారి చూసి, "మీవాణ్ణి రామ్మూర్తిలా అప్రయోజకుణ్ణి చేయనులెండి" అన్నాడు. సుందరి అతనివైపు సాలోచనగా చూసింది. నేను గతుక్కుమని తలవంచుకున్నాను!

నిజమే, పదకొండేళ్ళ నిరుద్యోగం తరువాత ఎమ్మే యూనివర్శిటీ ఫస్ట్- రామ్మూర్తి- ఈ విధంగా ప్రయోజకుడయ్యాడు!

సూర్యుడు ఉదయిస్తున్నాడో, ఉరి పోసుకుంటున్నాడో అర్థంకాని ఒక రంగుల చిత్రం నా మనో యవనికమీద ప్రత్యక్షమయింది!!!